క్లుప్తంగా

భారీ వర్షానికి పెంకుటిల్లు నేలమట్టం



శాయంపేట : మండలంలోని సూర్యానాయక్ తండాకు చెందిన జరుపుల బాలు పెంకుటిల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుధవారం రాత్రి నేలమట్టమైంది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని స్థానికులు తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

గోదాంను పరిశీలించిన ఏఓ



పరకాల : ప్రాథమిక వ్యవసాయ శాఖ గోదాంను ఏఓ శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన ఆయన.. నిల్వ సరుకుల్లో వ్యత్యాసాలను పరిశీలించారు. అదే విధంగా ఎమ్మార్పీకే కొనుగోలు చేస్తున్నారా.. అని రైతులను అడిగి తెలుసుకున్నారు. డీలర్స్, సొసైటీ నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ శ్రీనివాస్ హెచ్చరించారు.

ఉచిత వైద్యశిబిరం

ధర్మసాగర్ : మండలంలోని ఎల్కుర్తి సబ్ సెంటర్ పరిధిలోని సాయిపేటలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ అలేఖ్య తెలిపారు. టైఫాయిడ్, మలేరియా, వైరల్ ఫీవర్ ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

గుంతల పూడ్చివేత

వేలేరు : మండలంలోని శాలపల్లి రోడ్లపై ప్రమాదకరంగా ఉన్న గుంతలను వెంకటశ్రీ స్టోన్ క్రషర్ యాజమాన్యం గురువారం పూడ్చివేసింది. స్టోన్ క్రషర్ ప్రతినిధి రవికిరణ్ రెడ్డి మాట్లాడుతూ.. పీచర నుంచి వేలేరు మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గుంతలు ఏర్పడగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గుంతల్లో డస్ట్‌పోసి పూడ్చివేసినట్లు తెలిపారు.

వైన్స్‌లో చోరీ



ధర్మసాగర్ : మండల కేంద్రంలోని శివ బాలాజీ వైన్స్‌లో చోరీ జరిగింది. ఈ మేరకు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వైన్ షాపు కిటికీలు ధ్వంసం చేసి షాపులోని రూ.30 వేల నగదుతో పాటు మద్యం చోరీ అయినట్లు పేర్కొన్నారు. మద్యం షాపు యజమాని శ్యాం సుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నియామకం

వేలేరు : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు చిల్పూరి రజనీకాంత్, మారుపాక కోటీ, జోడుముంతల నవీన్, శివరాత్రి నాగరాజును బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులుగా నియమించినట్లు మండల అధ్యక్షుడు రాజు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాలు అందించారు.

బాధితులకు ఓదార్పు



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ములకనూరు గ్రామానికి చెందిన ముష్కె లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆమె దశదిన కర్మకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ హాజరయ్యారు. బాధిత కుటుంబానికి పరామర్శించి ఓదార్చారు. కాగా బాధితురాలి కుమారుడు వివేక్ గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందే.

పరామర్శ..



వేలేరు : మండల కేంద్రానికి చెందిన ముడపు చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ కుడా డైరక్టర్ బిల్లా యాదగిరి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 50 కేజీల బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రమౌళి, మల్లయ్య, రాజయ్య, కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బోధనలు ఆదర్శం

- ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు
- ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన విద్యార్థులు
- ఉత్తములకు ప్రశంస పత్రాల ప్రదానం



పరకాల : పట్టణంలోని బిట్స్ పాఠశాలలో వివిధ వేషధారణలో విద్యార్థులు



శాయంపేట : పెద్దకోడెపాకలో..



శాయంపేట : సీఎస్ఐ చర్చిలో..



ఆత్మకూరులో..

కమలాపూర్ : ఉపాధ్యాయుల బోధనలు ఆదర్శమని, విద్యార్థులు రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాధాకృష్ణన్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్ జ్యోతి ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాల : ఉపాధ్యాయ దినోత్సవంతోపాటు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో పండుగ వాతావరణం నెలకొంది. గురువులను గౌరవించుకుంటూ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అదే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. బిట్స్‌లో విద్యార్థులు సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకోగా.. శారదా విద్యాలయంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణను ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు సన్మానించారు.

ఎల్కతుర్తి : ఉపాధ్యాయ దినోత్సవాన్ని భీమదేవరపల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. దివంగత మాజీ ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

శాయంపేట : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో, పెద్దకోడెపాక శ్రీవేద పాఠశాలలో వేడులను గురువారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ అనిల్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్, ఫాస్టర్ ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎస్సై సురేశ్ గురువారం డిక్షనరీలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

దామెరలో

దామెర : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు రాజేశ్‌కుమార్, ఉపాధ్యాయులు నవీన్, రవీందర్, రుక్మిణి, వెంకటేశ్, రమేశ్‌రెడ్డి, ఉమామహేశ్వర్, సుజన, మాధవి పాల్గొన్నారు. అలాగే ఒగ్లాపూర్ డీస్నీల్యాండ్ పాఠశాలలో, ఏకశిలా పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

గౌరిశెట్టికి అవార్డు

వేలేరు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పీజీ హెచ్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న గౌరిశెట్టి రాజన్న గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఆయన గత 37 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. తన తండ్రి, తాను, తన ముగ్గురు పిల్లలు చదువుకున్న తన స్వగ్రామం వేలేరు పాఠశాలలోనే ప్రస్తుతం గెజిటెడ్ హెచ్ఎంగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తములకు సన్మానం..

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్నారు. పెద్దకోడెపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న రవి, అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న రఘు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై పురస్కారాలు అందుకోగా తోటి ఉపాధ్యాయులు సన్మానించారు.

ఐనవోలు : మండలంలోని ఏకశిల పాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ బాబా డాక్టర్, వైస్ ప్రిన్సిపాల్ రవికిరణ్, అకాడమిక్ ఇన్‌చార్జ్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

నడికూడ: మండలంలోని వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.



ఐనవోలులో..



దామెరలో..



వేలేరు : విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తున్న ఎస్సై



కమలాపూర్ : ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న పీఓ జ్యోతి



ఎల్కతుర్తి : బావుపేటలో..

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

ఐనవోలు : మహిళలు స్వయంఉపాధిని ఏర్పచుకొని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని నందనం గ్రామంలో సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు చైతన్యవంతులు కావాలని, 3 నెలల పాటు అందించే కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మా అమ్మ టైలర్ పని చేసేదని, తాను కూడా ఆమెకు సహాయంగా గుండీలు, కాజాలు కుట్టేవాడినని గుర్తు చేసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం మహిళలందరికీ కుట్టు మిషన్లు ఉచితంగా అందించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. 17వ ఉచిత శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్న సిరి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పరికి సుధాకర్‌ను అభినందించారు. లీగల్‌సెల్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు బండి సంపత్, నాయకులు యాదగిరి, రాజు, సాంబయ్య, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు జానకిదేవి, రజియాబేగం, పుల్లమ్మ, వాణి, సీసీ రమేశ్‌బాబు, ఉమెన్స్ క్లబ్ కో ఆర్డినేటర్ కల్యాణి, స్వర్ణలత, మానస, లావణ్య, అరుణాకర్, ప్రసాద్, సమ్మయ్య, రాకేశ్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ నిధులతో ప్లేజోన్ ఏర్పాటు



ప్లే జోన్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం

ఐనవోలు : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎంశ్రీ నిధులతో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్లేజోన్‌ను గురువారం ప్రారంభించినట్లు ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ప్రతాప రత్నకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం పీఎంశ్రీ నిధులు రూ.98 వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ నిధులతో ప్లే జోన్‌లో ఊయల, జారుడుబండ తదితర ఆట వస్తువులను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ప్రతి రోజు కనీసం గంట పాటు విద్యార్థులు క్రీడలు ఆడితే మానసికంగా ఆహ్లాదంగా ఉండటమే కాకుండా జ్ఞాపకశక్తితో పాటు తెలివితేటలు పెరుగుతాయన్నారు. ప్లేజోన్ ఏర్పాటుతో విద్యార్థులు సంబురపడ్డారు. ఏఏపీసీ చైర్మన్ సకినాబి, నవీన్, రాజు, కరుణాకర్, రవీందర్, రాజ్‌కుమార్, ఆనందం, రఫీ, ఉపాధ్యాయులు ఆరోగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పీపీఈ కిట్లు ధరించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న రాంబాబు

శాయంపేట : పంట క్షేత్రాల్లో పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు పీపీఈ కిట్లను ధరించాలని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం క్షేత్ర సిబ్బంది పల్నాటి రాంబాబు అన్నారు. మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో అమలు పరుస్తున్న హెడ్అండ్ఎం ప్రాజెక్టులో భాగంగా గురువారం రైతలుకు అవగాహన కల్పించారు. రైతులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పంటసాగు చేయాలని అన్నారు. పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో శరీరాన్ని కప్పి ఉంచే విధంగా హెల్మెట్, కళ్లజోడు, మాస్క్, గ్లౌజులు ధరించాలని అన్నారు. రైతులు బుచ్చిరెడ్డి, మహేందర్ రెడ్డి, ఆగిరెడ్డి, లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, నర్సింహస్వామి, నాగేశ్వర్‌రావు, రాజేందర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఏర్పాటు వద్దే వద్దు..



మున్సిపాలిటీ వద్దంటూ వినతిపత్రం అందజేస్తున్న పెంచికలపేట గ్రామస్తులు

ఆత్మకూరు : ఆత్మకూరును మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దు అంటూ అభ్యంతరాలు వెల్లువెత్తాయి. గురువారం మండల కేంద్రంతో పాటు కామారం, నీరుకుళ్ల, పెంచికలపేట, గుడెప్పాడ్, తిరుమలగిరి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీరుకుళ్ల, పెంచికలపేట, కామారం, తిరుమలగిరి గ్రామాల్లోని ప్రజలు మున్సిపాలిటీగా ఏర్పాటు చేయొద్దని ఏకగ్రీవంగా తీర్మానించి అధికారులకు అందించారు. అలాగే ఆత్మకూరు, గుడెప్పాడ్‌లో కొంతమంది మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు మున్సిపాలిటీకి అనుకూలంగా, కాంగ్రెస్ నాయకులు వ్యతిరేకంగా వినతులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. కాగా వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం గ్రామ సభలు నిర్వహించినట్లు వారు వెల్లడించారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ధర్మసాగర్ : గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గురువారం గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల ఏర్పాటుకు విద్యుత్ శాఖ, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే మండపాల వద్ద పూజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, పెద్ద శబ్దాలు వినిపించేలా మైకులు ఏర్పాటు చేయొద్దని సూచించారు.

దామెరలో..

దామెర : గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహకులు నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. నిర్వహకులు తప్పకుండా పోలీస్ ప్రోటోకాల్ వెబ్‌సైట్ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలని అన్నారు. విద్యుత్ శాఖ అనుమతితో విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని అన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఐనవోలు : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని వనమాల కనపర్తి, కొండపర్తి గ్రామాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాడవాడన మెడికల్‌క్యాంపు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రస్తుతం డెంగీ తదితర వైరల్ ఫీవర్స్ అధికం అవుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని అన్నారు. కొండపర్తిలో నీటి నాణ్యతను పరీక్షించారు. ఎంపీడీఓ పులి వెంకటేశ్వర్లు, ఏపీఓ నక్క కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లెకు రాని ప్రత్యేకాధికారి

ఆందోళకు దిగిన గ్రామస్తులు



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

శాయంపేట : గ్రామ సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో ప్రభుత్వం పల్లెలకు ప్రత్యేకాధికారులను నియమించింది. కాగా గురువారం మండలంలోని రాజుపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు గ్రామప్రత్యేక అధికారి ఎక్కడా..? అంటూ ఆందోళనకు దిగారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కడచూసినా గుంతల రోడ్లు, మురుగునీరుతో పారిశుధ్యం లోపించిందన్నారు. సర్పంచ్ పదవి కాలం ముగియడంతో ఇప్పటి వరకు గ్రామానికి ప్రత్యేక అధికారి ఎవరో కూడా తమకు తెలియదని అన్నారు. అనేక సమస్యలతో గ్రామం కొట్టుమిట్టులాడుతుందని ఆగ్రహించారు. గ్రామస్తులు మాధవరావు, నరసింహరావు, లక్ష్మణరావు, బుచ్చయ్య, మహేందర్, రవి, రాజు, తిరుపతిరావు, నర్సింగరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌రూల్స్ పాటించి గమ్యం చేరాలి

కమలాపూర్ : మినీ వ్యాన్‌గూడ్స్ యజమానులు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ సూచించారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ భద్రకాళి మినీ వ్యాన్‌గూడ్స్ అసోసియేషన్ కార్యాలయాన్ని గురువారం ఆయన స్థానిక ఎస్సై వీరభద్రరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మినీ వ్యాన్ గూడ్స్ యజమానులు, డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అన్ని రకాల పత్రాలు కలిగి ఉండాలన్నారు. వాటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సమయానుగుణంగా వాహనాల ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని అన్నారు. వాహనాలు నడిపే సమయంలో మద్యం చేవించొద్దని, అతివేగం ప్రమాదకరమని గుర్తించుకోవాలని అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు పుల్ల రాకేశ్, ఉపాధ్యక్షుడు చెరిపెల్లి సంజీవ్, ప్రధాన కార్యదర్శి మొర్రి కుమారస్వామి, సంయుక్త కార్యదర్శి ఒంటేరు రమేశ్, కోశాధికారి మషిక భాస్కర్, కార్య నిర్వాహక సభ్యులు రాజు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా మార్గం అనుసరణీయం



కాజీపేట: మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాయిని

కాజీపేట: పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలపై మదర్ థెరిస్సా చూపిన ప్రేమ, ఆప్యాయతలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. మదర్ థెరిస్సా 27వ వర్ధంతిని పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ ఫాతిమానగర్ జంక్షన్‌లో ఆమె విగ్రహానికి కథోలిక గురువులతో కలిసి ఎమ్మెల్యే గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కథోలిక మేత్రాసనం పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుమల బాల, కెథడ్రల్ చర్చి విచారణ గురువు కాసు మర్రెడ్డి, లోడి డైరెక్టర్ ఫాదర్ ఎస్.ఇన్నారెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు నివాళి

హసన్‌పర్తి: నోబెల్ బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా వర్ధంతిని హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గడువు పెంపు

దేశాయిపేట: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024 -25వ విద్యా సంవత్సరానికి డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడిగించినట్లు వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ కళాశాల అభ్యాసకుల సహాయ కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.అనిల్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 30వ తేదీ లోపు www.braouonline.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిషన్ పొందాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7382929618 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



శాయంపేట : మండలంలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం పలు గ్రామాలను సందర్శించారు. అనంతరం మాట్లాడారు. భారీ వర్షాలతో పత్తి పంటలో నీరు జాలువారి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. పత్తి ఎర్రబడి ఎదుగుదల తగ్గిందని, వరి పొలాలు నీట మునిగాయని తెలిపారు. అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు కొమురయ్య, పెద్ద తిరుపతి, పెద్దిరెడ్డి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.